

# ప్రేముడి

## - మంథా భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**"అట్లయితే సరే**.. నేను మూడు రోజులుగా మీ పని మీదనే ఉన్నా. చాలా మందిని కాంటాక్ట్ చేశాను. పిల్లల సంగతి కూడా ఆలోచించి ఒక ప్రణాలిక వేశాను. మీరంతా ఒప్పుకుంటానంటే.."

"అంత మాటెందుకమ్మా! మీ గురించి అమ్మ చాలా చెప్పింది. మీరెట్టంటే అట్టే చేస్తాం." సాంబడికి డాక్టరమ్మని చూడగానే తనకున్న అనుమానాలు, సందేహాలు సగం తగ్గి పోయాయి. తరువాత అమ్మగారు చెప్పింది విటుంటే ఇంకా ధైర్యం వచ్చింది.

సులోచన, పక్కనే బల్ల మీద పెట్టుకున్న నోట్ పాడ్ పెన్ను తీసి, బొమ్మలు గీస్తూ వివరించ సాగింది.

అంతా అయ్యాక లోపల్నుంచి డాక్టర్ సుధాకర్, సులోచన భర్త గంభీరంగా నడుచుకుంటూ వచ్చారు. మెళ్ళో స్టెతోస్కోప్, తెల్లని ఓవరాల్.. లేత నీలం ఫుల్ హాండ్ షర్ట్, తెల్లని పాంటుతో, చూడగానే గౌరవ భావం కలుగుతుందెవరికైనా!

అందరూ లేచి నిలబడ్డారు, డాక్టరమ్మతో సహా.

"ఓ.. వీళ్ళేనా నువ్వు చెప్పిన వాళ్ళు. కానీండి. డాక్టర్ గారు చెప్పినట్లే వినండి. పైకొచ్చిన ప్రతీ వారికీ ఒక మైలురాయి దొరుకుతుంది లైఫ్ లో. అది మీ విషయంలో డాక్టరమ్మే!"

## 11

"అమ్మా! మరీ అంత ఆశ లేదమ్మా.. మీకు మరీ భారం అయిపోతామేమో! ఏదో రెండు మూడేళ్ళలో స్థిర పడి పోతే అంతే చాలు. లంక లోంచి కొన్నాళ్ళు బైటికి రావాలనే కానీ పూర్తిగా వేరే ప్రపంచం లోకి వెళ్ళాలని లేదు డాక్టరమ్మా!" వెంకమ్మ, సులోచన ప్రణాలికకి ఒప్పుకోవట్లేదు.

"నాకేం భారం కాదు వెంకటలక్ష్మీ! ఇదొక ప్రాజెక్ట్ కింద మా క్లబ్ వాళ్ళు తీసుకుంటామన్నారు. కృష్ణవేణి కైతే ఫీజులే ఉండవు. రెండేళ్లలో కోర్సయిపోతుంది. పిల్లలూ, తనూ ఒకే హాస్టల్లో ఉండేట్లు ఏర్పాట్లు చేద్దాము. తనకైతే స్టైఫండ్ కూడా ఉంటుంది."

సాంబడు, కృష్ణవేణీ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకునివింటున్నారు.

ఇదంతా కలో నిజమో అర్ధం కావట్లేదు వాళ్ళకి. వెంకమ్మ కొంచెం మెత్తబడ్డట్టు కనిపించింది.

"ముందు భోజనాలు చెయ్యండి. తరువాత తీరిగ్గా మాట్లాడుకుందాం. వంటమ్మాయికి పొద్దున్నే చెప్పేశా."

చెరో చేతిలో బొమ్మలతో నాగరాజు, నాంచారి వచ్చారు.

"అక్కా! మరే.. తోట చానా బాగుంది. ఆ అన్న కూడా. మాకు చాక్లెట్లిచ్చాడు." నాగరాజు సంబరంగా అన్నాడు. నాంచారి, చేతిలో

ఉన్న మెత్తటి కుక్కపిల్ల బొమ్మని గట్టిగా పట్టుకుని, కృష్ణవేణి ఒళ్ళో దూరింది.

"అట్లాగేం! మరి ఇట్టాంటి చోట్లో ఉండి పోతారా?" సులోచన అడిగింది.

"ఓ.. మరి అక్క కూడా ఉంటందా?" నోట్లో ఉన్న చాకొలేట్ నమిలేసి అడిగాడు నాగరాజు.

వెంకటలక్ష్మి బయోడాటా లివ్వగానే ఉదాసీనంగానే తెరిచింది సులోచన.

చదువుతుంటే ఒక్కసారి కళ్లు పెద్దవయ్యాయి. సాంబడికి పదో క్లాసులోనూ, ఇంటర్ లోనూ కూడా తొంభై పైనే వచ్చాయి మార్కులు. స్కూలు మాస్టర్ అయితే.. "మట్టిలో మాణిక్యం.. ఏ పుణ్యాత్ములైనా సాయం చేస్తే చాలా పైకొస్తాడు." అని రాశారు బయోడాటా కింద. పైగా వెంకటలక్ష్మి వాళ్ళు రిజర్వేషన్ కోటా కింద వస్తారు.

ఎప్పుడో.. ఆర్నెల్ల క్రితమో సంవత్సరం క్రితమో, రోటరీ క్లబ్ మీటింగ్ కెళ్తే, అక్కడ సభ్యుడొకరు ఎవరైనా పేద పిల్లలుంటే చదువు చెప్పిద్దామనుకుంటున్నా అని అనడం గుర్తుకొచ్చింది. వెంటనే విజయవాడలో ఉంటున్న అతనికి ఫోన్ చేసింది. అక్కడ పెద్ద బిజినెస్మెన్ అతను. ఎప్పటి సంగతో.. ఏమంటాడో. ఎడం చేతికి తెలీకుండా దానమియ్యాలిట. ఆ మాత్రం కూడా ఆలిశ్యం చెయ్యద్దని. కానీ.. వెంటనే సరే అనేశాడతను.

"డాక్టర్ గారూ! ఈ సంగతి ఎవరికీ తెలియ నియ్యకండి. మీకైతే సరైన కాండిడేట్ తెలుస్తారు. ఇద్దరు ముగ్గురైనా ఫరవాలేదు. నేనిట్లా చేస్తున్నానని తెలుస్తే మా ఓళ్ళంతా వెంటబడ్తారు. అందుకని.. ఏమనుకోకండి. మనం మంచి పని చేశేప్పుడు డప్పు కొట్టుకోక్కర్లేదు కదండీ. పిల్లల వివరాలు, ఏం చెయ్యాలనుకుంటున్నారో.. అన్నీ పంపండి. నేను ఏర్పాట్లు చేస్తాను."

కలిసొచ్చే కాలం వస్తే ఇట్లాగే ఉంటుందనుకుంది సులోచన.

ఆ పెద్దమనిషి క్లీన్ చిట్ ఇచ్చారు కదా అని అతి చెయ్యకుండా, ఒక్క సాంబడి కోసమే అడగాలని నిశ్చయించింది. వెంటనే తన ప్లాన్ అంతా సంవత్సరం ప్రకారం.. రెండు రకాలుగా వేసి ఇచ్చింది. ఒకటి ప్రణాలిక పని చెయ్యకపోతే ఇంకొకటి.

కృష్ణవేణి సంగతి మాత్రం తనే చూద్దామనుకుంది.

ఎన్నో ఫోన్ల తరువాత కావలసిన సమాచారం వచ్చింది. టెన్త్ క్లాస్ అయ్యాక ఇంటర్ వొకేషనల్ కోర్స్ అయితే ఉద్యోగాలు త్వరగా వస్తాయి. ఆ తరువాత నెమ్మదిగా పై చదువులు చదువు కోవచ్చు. అనాధాశ్రమాలు, ఛారిటీ సంస్థలు నడిపే హాస్టళ్ళు, బాక్వర్డ్ క్లాస్ హాస్టళ్ళు కూడా చాలానే ఉన్నాయి. అందులోనే ఏదో ఒక దాంట్లో కృష్ణవేణినీ, పిల్లలిద్దరినే ఉంచే ఏర్పాట్లు చెయ్యచ్చు. రెండు సంస్థల్లో నైతే సులోచన, సుధాకర్ ప్రతీ వారం వెళ్ళి సర్వీస్ చేస్తుంటారు కూడా.

భోజనాలయ్యాక సులోచన మళ్ళీ ఒకసారి విడమర్చి చెప్పింది. పిల్లలిద్దరూ, కడుపులు నిండగానే హాల్లో చాప మీద పడుక్కున్నారు.

"కృష్ణవేణి చదువు ఫరవాలేదమ్మా! నర్సింగ్ ట్రైనింగ్ అంటున్నారు కదా. సాంబడిదే నాకు అనుమానంగా ఉంది. తట్టుకోగలడా అని." వెంకమ్మ భోజనాల బల్ల శుభ్రం చేసొచ్చి, డాక్టరమ్మ పక్కన కింద కూర్చుని అంది.

సులోచన సాంబడిని చూసింది. ప్రణాలిక గురించి చెప్పినప్పట్నుంచీ సాంబడేం మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డట్లు అతని ముఖ కవళికలే చెప్తున్నాయి. జరుగుతున్నదంతా నిజమేనా అని నమ్మలేనట్లు చూస్తున్నాడు. పరిస్థితుల కనుగుణంగా తనని తాను మార్చుకోగలడు సాంబడు, అచ్చు వెంకటలక్ష్మి లాగనే. పాలెంలో చేపలు పట్టే వాడిలా.. అక్కడి వాళ్ళతో కలిసి పోతాడు. కాలేజ్లో వేరే అవతారం ఎత్తుతాడు.

ఇంటర్ చదివేటప్పుడు మాష్టర్లందరూ ఎంతో బ్రతిమాలారు, యెమ్సెట్ కి తయారవమని. అతనిక్కూడా సైన్స్ అంటే చాలా ఇష్టం. నిత్యం చేపలతో, ఎండ్రకాయల్తో.. ఇతర జంతువులతో గడుపుతాడేమో, వాటి నిర్మాణం మీదా, కదలికల మీదా ఆసక్తి ఎక్కువ. ఇంక

మనుషులైతే చెప్పనే అక్కర్లేదు. ఊర్లో ఎవరికి ఏ జబ్బొచ్చినా అక్కడే ఉంటాడు.

సాంబడికి వేరే రకంగా రాసి పెట్టుందేమో! చేపలు పట్టే పనికాదు నువ్వు చెయ్యవలసింది అని..అందుకే డాక్టర్ సులోచననీ, వెంకటలక్ష్మినీ కలిపింది విధి.

"సాంబడూ! నువ్వేమంటావు? ఏం మాట్లాడట్లేదు." సులోచన అతని కేసి తిరిగి అడిగింది.

"ఏం చెప్పనమ్మా! ఇంకా నమ్మకం కలగట్లేదు. కానీ ఈ సంవత్సరం యమ్సెట్ కి టైమయిపోయింది కదమ్మా! బియస్సీ లో చేరడమే మిగిలింది. మీరింత చక్కని అవకాశం ఇస్తుంటే కాదనడానికి కారణం ఏముంటుందమ్మా? అందరం తలొక చోట ఉండలేమని తప్పితే పెద్ద ఇబ్బందులేం ఉండవు."

"కానీ నిన్ను లాంగ్ టెర్మ్ కోర్స్ లో చేరిపిద్దామనుకుంటున్నాము."

"మళ్లీ ఒక సంవత్సరం వేస్ట్ అయిపోతుందమ్మా! అస్సలే నేను వన్ ఇయర్ లేట్ గా ఉన్నా. బి.యస్సీ లో చేరి యమ్సెట్ కి ప్రిపేర్ అవుతా. సాయంత్రం ఇండివిడ్యువల్ గా సబ్జెక్ట్స్కి ట్యూషన్ కెళ్ళి బాగా చదువుతాను. వచ్చిందా వస్తుంది. లేదా బియస్సీ క్కూడా ఆ సబ్జెక్ట్స్ ఉపయోగిస్తాయి."

కృష్ణవేణి కళ్ళు పెద్దవి చేసి సాంబడినే చూస్తుండి పోయింది. నిజంగా ఇతను సాంబడేనా? ఆ భాష.. ఆ ఆలోచన. ఆ నిండుతనం.. కొత్తమనిషిలా అనిపిస్తున్నాడు.

"సెభాష్ సాంబడూ! నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. నీ ఇష్టం వచ్చినట్లే చెయ్యి. వెంకటలక్ష్మినీ పిల్లల్నీ రేపే రెండు మూడు రకాల హాస్టల్స్ కి తీసుకెళ్ళి చూపిస్తా. హాస్పిటల్ లో రెండు గదులు ఖాళీ ఉన్నాయి. అక్కడ ఫ్రంట్ డెస్క్ వాళ్ళకి చెప్పాను, మీరెళ్ళి అక్కడుండండి." సులోచన కుర్చీలోంచి లేవబోయింది.

"నాదొక్కమాటమ్మా!" అందరూ కృష్ణవేణి కేసి తిరిగారు.

"అత్త మా ఇద్దరికీ పెళ్ళి చేద్దామనుకుంది. ఈ చదువులన్నీ అయే సరికి ఎన్నేళ్ళు పడుతుందో. సాంబడికేం మగాడు.. నా సంగతేమిటని. ఇంక ఎవరి దారి వాళ్ళదై పోతుందేమో.." కంఠం బొంగురుపోయి ఆగిపోయింది.

సాంబడు దెబ్బతిన్నట్లు చూశాడు. చిన్నప్పటినుంచీ కృష్ణవేణి మీద పెంచుకున్న అభిమానం, ప్రేమ.. ఇంతేనా తనని అర్థం చేసుకుంది?

మళ్ళీ అతనిలో వివేకం మేలుకొంది. కృష్ణవేణి భయం అర్థం చేసుకున్నాడు. తన మీది వల్లమాలిన ప్రేమతోనే అట్లా మాట్లాడుతోంది. ఆమెకి తగిన భరోసా ఇవ్వాలి.

"డాక్టరమ్మా! మీరు మా మంచి కోరేవారు. చెప్పండమ్మా! నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ కృష్ణవేణిని తప్ప ఎవరినీ జీవితంలో నా తోడుగా ఊహించుకోలేదు. ఊహించని విధంగా అవకాశం వచ్చి పైకెదిగినా కిందికి చూడ్డం మానను. నే పెరిగిన వాతావరణం అటువంటిది. నా మీద నాకు నమ్మకం ఉంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ నా నిర్ణయం మారదు. అమ్మ మా పెళ్ళికి వచ్చే నెల్లో ముహూర్తం పెట్టించింది. మీకు నా మీద, నా ధృఢ నిశ్చయం మీద నమ్మకం ఉంటే అదే ముహూర్తానికి పెళ్ళి చేసుకుంటాను.. మీరు అనుమతిస్తే."

వెంకమ్మ తప్ప సులోచన, కృష్ణవేణీ నివ్వెరపోయారు. తాను వింటున్నది నిజమేనా? కృష్ణవేణికి కలా నిజమా అనేది అర్థం కాలేదు. భగవంతుడు అంతులేని వేదననీ, ఆశించని అదృష్టాన్నీ పక్క పక్కనే ఉంచుతాడా?

"కానీ, మేము అనుకున్నది సాధించే వరకూ స్నేహితుల్లాగే ఉంటాము. మీ నమ్మకాన్ని వమ్ము కానియ్యం డాక్టర్ గారూ. ఏం వేణీ ఏమంటావు?"

ఈ మాటలాడుతున్నది సాంబడేనా? ఆ కొత్త పిలుపు.. కొత్త తీరు. మనిషే కొత్తగా ఉన్నాడు. కృష్ణవేణి తల దించుకుంది, ఎర్రబడుతున్న బుగ్గలతో. ఛీ.. తను తొందర పడిందా?

వెంకమ్మ లేచి మేనకోడలి దగ్గరగా వచ్చి గుండెలకి హత్తుకుంది.

"నువ్వు తప్పేం అడగలేదే వేణీ! సరిగ్గానే మాట్లాడావు. ఇదంతా మీ భవిష్యత్తు గురించిన నిర్ణయాలు. అన్నీ ఒక కొలిక్కి వచ్చేట్లు ఇప్పుడే నిర్ధారించుకోవాలి. డాక్టరమ్మ చెప్పినట్లు చేద్దాం. పిల్లల సంగతి కూడా తేలుద్దాం. అనాధ శరణాలయానికి వప్పజెప్పేద్దామా లేదా అనేదికూడా."

కృష్ణవేణి కళ్ళలో మళ్ళీ భయం. పిల్లల మీద పెంచుకున్న ప్రేమ.. తుంచేసుకోవడమేనా?

అప్పటి వరకూ ప్రేక్షకురాలిగా నిలబడి పోయిన సులోచనలో చలనం వచ్చింది. వెంకటలక్ష్మి వాళ్ళ కుటుంబాలలో త్వరగా పెళ్ళిళ్ళు చేసేస్తారు. అన్నేళ్ళు ఆగడం మంచిదికాదు. పిల్లల సంగతి కూడా.. ఇప్పుడే తేల్చెయ్యాలి.

"అట్లాగే చేద్దాం వెంకటలక్ష్మీ! నాకు సాంబడి మీద, కృష్ణవేణి మీద కూడా నమ్మకం ఉంది. వాళ్ళు అనుకున్నది సాధిస్తారని. నువ్వు పెట్టిన ముహూర్తానికే పెళ్ళి చేసేద్దాం. ఇంక నాగరాజు, నాంచారిల సంగతి.. అనాధశరణాలయం కృష్ణవేణికి ఇష్టం ఉన్నట్లు లేదు. వాళ్ళ మీద ప్రేమ పెంచుకుంది. మీ బంధువులే అంటున్నావు కనుక నువ్వే గార్డియన్ గా ఉండు. హాస్టల్లో పెట్టేటప్పుడు. ఏ సమస్యలూ రావు.

రాత్రి హాస్పిటల్ లో ఒక గదిలోనే పడుక్కున్నారు అందరూ, ఆయాని జంపఖానా అడిగి. ఊర్లనించి వచ్చే రోగులతో పాటుండే వాళ్ళ కోసం అన్నీ ఉంటాయి అక్కడ.

"నిజంగా నమ్మ బుద్ధి కావట్లేదమ్మా!" సాంబడు తలుపు పక్కన గోడకానుకుని కూర్చుని అన్నాడు.

వెంకమ్మ పేషెంట్ మంచం మీద పడుకుంది. సాంబడి మాటలకి తను కూడ లేచి కూర్చుంది. పిల్లల్ని పడుకోబెట్టి కృష్ణవేణి కూడా ఆసక్తిగా వింటోంది.

పెద్ద ఆవరణలో ఉందా హాస్పిటల్. చుట్టూ పెద్ద తోట. తోటకి ఇద్దరు మాలీలున్నారు. తోట పని చెయ్యడమే కాకుండా ఎవరూ చెట్ల జోలికి రాకుండా కూడా చూస్తుంటారు. ఆ తోటలోనే పిల్లలు ఆడుకోవడానికి, ఉయ్యాల బల్లలు, జారుడు బండలు, సీ-సా బల్లలు వంటివున్నాయి.

వెంకమ్మ వాళ్ళు పడుక్కున్న గది వి.ఐ.పి లది. పెద్ద హాలు లా ఉంది. తోటలోకి పెద్ద కిటికీ. వెన్నెల కాంతులు విరజిల్లుతున్న చందమామ కనిపిస్తున్నాడు, వేపచెట్టు కొమ్మల మధ్యలోంచి. కిటికీలోంచి చల్లని గాలి వీస్తోంది.. ఫాన్ అవసరం లేకుండా. హాస్పిటల్ అంతా నిశ్శబ్దంగా ఉంది. తలుపులు వేసుకున్నారేమో చిన్న శబ్దం కూడా రావట్లేదు, అతి నెమ్మదిగా మాట్లాడుకుంటున్న వెంకమ్మ వాళ్ళ మాటలు తప్ప..

"నిజమే, నాక్కూడా అట్లనే అనిపిస్తోంది. అనుకున్నవి అనుకున్నట్లు జరుగుతే కావలసిందే ముంది. డాక్టరమ్మ మంచి మనసుతో చేస్తా ఉంది. తప్పకుండా అవుతుంది. మీరిద్దరూ పట్టుదలగా చదవాలి, పని చెయ్యాలి.. అంతే." వెంకమ్మ మాటలకి తలలూపారు ఇద్దరూ.

"ఇంత మంచి అవకాశం వస్తే కష్టపడకుండా ఎట్టుంటామమ్మా? మా శక్తి కొద్దీ పని చేస్తాం. ఆపైన పైవాడెట్టా రాశాడో! కానీ.. నా బాధంతా నీ గురించే. ఒక్క దానివీ ఎట్టుంటావా అని."

"చూద్దాం.. ఉండగలిగినంత కాలం ఉంటా. ఉండలేకపోతే, డాక్టరమ్మకే చెప్తా.. ఏదైనా పనుంటే ఎక్కడైనా చూడమని. ఆయా పనైనా సరే. అప్పుడప్పుడు మిమ్మల్ని చూస్తుండచ్చు.. ఒక చిన్న ఇల్లు తీస్కుంటే."

మరునాడు చాలా పనుందని ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుని పడుకున్నారు, పన్నెండింటికి.

ఆ రాత్రి అందరికీ కలత నిద్రే.. పిల్లలకి తప్ప.

టౌన్లోనే ఉన్న గవర్న్మెంట్ డిగ్రీ కాలేజ్లో చేరాడు సాంబడు. అందులో, లిస్ట్లో మొదటి పేరే అతనిది. ప్రిన్సిపాల్ చాలా సంతోషించారు.

"కానీ నాదొక్కటే డౌటయ్యా! నువ్వు మూడేళ్ళూ ఇక్కడ చదువుతావా అని.."

నవ్వేసింది డాక్టర్ సులోచన, ప్రిన్సిపాల్ గారి మాటలకి.

"డౌట్ అక్కర్లేదండీ.. అతను మూడేళ్ళూ ఇక్కడ చదవ కూడదనే అనుకుంటున్నాము."

"అయ్యో.. అనవసరంగా ఫీజ్ కూడా కట్టించేసుకున్నా. ఎంత పనై పోయిందీ?" ప్రిన్సిపాల్ విచారం.

"ఇతనికి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఎవరైనా ట్యూషన్ చెప్పగలరేమో కూడా కాస్త మీరే చూడాలండీ." సులోచన రిక్వెస్ట్ చేసింది. ప్రిన్సిపాల్ గారి అమ్మాయికి రెండు పురుళ్ళు సులోచన హాస్పిటల్ లోనే అయ్యాయి. పిల్లలు ఎప్పుడైనా వచ్చి నప్పుడు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఆవిడనే అడుగుతారు.

"బావుందమ్మా! ఇతను కాలేజ్ నుంచి వెళ్ళి పోవడానికి నేనే సాయం చెయ్యాలా? అయినా మీరు అడిగారు కనుక చెప్తా."

"ఫీజు అదీ ఇచ్చుకోలేడు. కానీ కష్ట పడతాడు. మీరు ఈ సాయం చెయ్యాలి.. తప్పకుండా."

"ష్యూర్. చేద్దాం. వారం రోజుల్లో క్లాసులు మొదలవుతాయి. రోజూ క్లాసులకి తప్ప కుండా రావాలి. అదీ కండిషన్. ఎక్కడా.. బిసి హాస్టల్లో ఉంటున్నాడా? నేను వార్డెన్ కి కూడా చెప్తా.. కొంచెం మంచి రూమ్ ఇమ్మని. డాక్టర్ గారి కాండిడేట్ అంటే ఏ ప్రాబ్లమ్ ఉండదు."

సాంబడు చేరిన నెల లోపే అందరికీ నచ్చేశాడు. వినయం, వివేకం సమపాళ్ళలో ఉంటే ఎవరికి నచ్చడు?

కృష్ణవేణి క్లాసులు కూడా మొదలయ్యాయి. ఏడాది తరువాత ఒక క్రమ శిక్షణకి అలవాటు పడాల్సి వచ్చిందేమో.. మొదట్లో కొంచెం కష్ట పడింది. రోజుకి ఎనిమిది గంటలు పైగా నిలుచునే ఉండాలి. హాస్టల్లో బాగానే ఉంటుంది కానీ.. అన్నీ టైమ్ ప్రకారం ఇస్తారు. వొకేషనల్ ట్రైనింగ్ వాళ్ళకి టైమింగ్స్ వేరే ఉంటాయి. వంట వాళ్లతో చెప్పి, పొద్దున్న బ్రేక్ఫాస్ట్ అవగానే.. అదే కొంచెం మధ్యాన్నానికి పొట్లాం కట్టిమ్మని చెప్పించింది సులోచన.

ఆ వొకేషనల్ ఇన్స్టిట్యూట్ వాళ్ళకి డాక్టర్ల అవసరం చాలా ఉంటుంది.. ట్రైనింగ్ అవగానే ఉద్యోగాలకి, ట్రైనింగ్ లో లెక్చర్స్ ఇవ్వడానికి, కొంత ప్రాక్టికల్స్ కి.. రకరకాలుగా. కృష్ణవేణికి ఏదైన కొత్త సబ్జెక్ట్ లో ట్రైనింగ్ వస్తే మొదటి ఛాన్స్ ఇస్తున్నారు.

అట్లాగే పిల్లలు కూడా కొత్త చోటులో బాగా అలవాటై పోయారు. పగలంతా డే కేర్. అక్కడ.. ప్రైవేట్ డే కేర్ లలాగా ఉండక పోయినా.. బాగానే చూస్తారు. ప్రతీ నలుగురు పిల్లలకీ ఒక ఆయా ఉంది. పాలకీ, ఆహారానికీ లోటు లేదు. ప్రభుత్వమే కాకుండా, కొందరు ఉదారుల సహాయం కూడా ఉంది. అక్కడ కూడా సులోచన డాక్టరమ్మ తాలూకా అంటే కొంచెం ప్రత్యేకం.. పనై పోగానే కృష్ణవేణి పిల్లల దగ్గరికి వెళ్ళి పోతోంది. తన మంచం, మకాం కూడా వార్డెన్ కి చెప్పి పిల్లల హాల్లో వేయించుకుంది.

వెంకమ్మ ప్రస్థుతానికి పాలెంలోనే ఉంటోంది.. చేపలు పట్టడమే కాక, పట్టిన వాళ్ళ దగ్గర కొని, టౌనుకి తీసుకెళ్ళి అమ్మడం కూడా చేస్తోంది. టౌను కెళ్ళినప్పుడు బిసి హాస్టల్లోనే ఉంటోంది, కృష్ణవేణి దగ్గర.

ఉన్న ఒకరోజూ, రెండ్రోజులూ అక్కడ బోలెడు పని చేస్తుంది. పిల్లలకి కథలు చెప్తుంటుంది.

మొత్తానికి డాక్టర్ సులోచన ఆశ్రయంతో కుటుంబం అంతా ఒడ్డున పడ్డట్లయింది. భవిష్యత్తులో ఏం జరగ బోతోందో మరి!

సాంబడు తల వంచి కృష్ణవేణిని చూస్తున్నాడు. సాధారణ మైన అలంకరణ లోనే మెరిసిపోతోంది కృష్ణవేణి. సాంబడి చూపులు తననే పరికిస్తున్నాయని తెలుసు. సిగ్గులమొగ్గయి ఒద్దికగా కూర్చుంది. పంతులుగారు సాంబడిని పిలిచారు..

ఉలిక్కి పడి అటు చూసిన సాంబడికి చేత్తో సైగ చేశారు, మంత్రాలు చదువుతూనే!

కృష్ణవేణి పక్కనే కూర్చున్న సులోచన, సుధాకర్ ముసిముసి నవ్వులు నవ్వుతున్నారు. కొంచెం దూరంలో వెంకమ్మ కుర్చీ మీద కూర్చుని, ఉత్కంఠతతో చూస్తోంది. ఆవిడని ఆనుకుని కోరారంగు కుర్తా పైజాలో నాగరాజు, మెరిసిపోతున్న పరికిణీ, జాకెట్టు వేసుకుని నాంచారి బుద్ధిగా కూర్చున్నారు.

సరస్వతమ్మ, కొడుకు, ప్రిన్సిపాల్ గారు, సాంబడు సాయంత్రాలు ట్యూషన్ చెప్పించునే మాష్టర్లు ముగ్గురు, షావుకారు, భార్య. వీళ్ళే అతిథులు. మొత్తం పదిమంది కూడ లేరు.

పంతులుగారు సైగ చేశాక, సాంబడు, వంగుని మంగళ సూత్రం చేతుల్లోకి తీసుకుని, కృష్ణవేణి మెడలో మూడుముళ్ళూ వేశాడు. ప్రిన్సిపాల్ గారు, మాష్టర్లు తెచ్చిన దండలు ఇద్దరూ మార్చుకున్నారు.

అంతే.. సాంబడికీ, కృష్ణవేణికీ పెళ్ళయి పోయింది. ఆరోజు నుంచీ ఇద్దరూ భార్యాభర్తలు. పీటలమీద నుంచి లేచి నిలుచుని, పెద్దవాళ్ళందరి పాదాలకీ నమస్కారాలు చేశారు. ఇద్దరూ కొత్త కొత్త వెలుగులతో మెరిసిపోతున్నారు.

డాక్టర్ సులోచనగారి హాలులో పెళ్ళి జరిగిపోయింది. డాక్టర్ దంపతులు శాస్త్రోక్తంగా కన్యాదానం చేశారు. వచ్చిన అతిథులకి పాయసం, పులిహోర, రెండు కూరలు, పప్పు, పులుసు, అప్పడాలతో విందు భోజనం వడ్డించారు. వెంకమ్మ ఎవరూ చూడకుండా కన్నీళ్ళు తుడుచుకుంది కొంగుతో. శుభకార్యం అని తెలుసు కానీ.. కొన్ని స్పందనలు మనిషి అంగీకారం లేకుండానే కలుగుతాయి మనసుకి.

షావుకారు మంగళసూత్రాలు, గొలుసు ఇచ్చాడు.. వద్దు వద్దంటుంటే వినకుండా. వద్దు వద్దంటుంటే వినకుండా. ఆ తల్లే లేకపోతే ఈ ఊపిరుండేది కాదమ్మా అంటూ.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments